నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 10 ఫిబ్రవరి 2025 | SIDDIPET

పంప్‌హౌస్ పనులు వేగవంతం చేయాలి

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నంగునూరు, ఫిబ్రవరి 9 : నంగునూర్ మండలం ఘణపూర్‌లో నిర్మిస్తున్న పంప్‌హౌస్ నిర్మాణ పనుల జాప్యంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటిపారుదలశాఖ అధికారులు, మండల ముఖ్య నాయకులతో కలిసి ఆయన ఘణపూర్ పంప్‌హౌస్ నిర్మాణ పనులు, సాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యే విధంగా ఇప్పటికీ విద్యుత్ సరఫరా చేయించామని, అందుకు అవసరమైన భూసేకరణ చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నా పనులు ఎందుకు జరగడం లేదన్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి పంప్‌హౌస్‌ను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. పంప్‌హౌస్ పూర్తయితే వాగు అవతలి గ్రామాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పటికే రంగనాయక సాగర్‌కుడి కాల్వ ద్వారా నీళ్లు విడుదల చేశామని, మండలంలోని కాల్వల ద్వారా అన్ని చెరువులకూ నీళ్లు చేరే విధంగా అధికారులు సమన్వయం కావాలని, నాయకులు అందు కు చొరవ చూపి రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. సమీక్షలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఎడ్ల సోంరెడ్డి, సంగు పురేందర్, ఇరిగేషన్ జేఈ రాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పబ్బతి రాంరెడ్డి పాల్గొన్నారు.

కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

సిద్దిపేట జిల్లా తోర్నాలలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 9: తెలంగాణ రాష్ట్రానికి మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారని బీఆర్ఎస్ ధూళిమిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని తోర్నాల, బెక్కల్ గ్రామాల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని ఏమూలకు వెళ్లినా ప్రజలు కేసీఆర్ మళ్లీరావాలని బలంగా కోరుకుంటున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి దిమ్మతిరిగేలా ప్రజలు తీర్పు ఇవ్వనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు నిమ్మ రాజీవ్‌రెడ్డి, పుర్మ వెంకట్‌రెడ్డి, పచ్చిమడ్ల సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి, నాయకులు నాచగోని వెంకట్‌గౌడ్, తాళ్లపల్లి భిక్షపతి, చొప్పరి సాగర్, యాదగిరి, నలుగొప్పుల రాములు, కంకణాల శ్రీనివాస్, ఎర్ర సాయి, ఆరె జగన్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు గోనెపల్లి మల్లేశం, రాములు పాల్గొన్నారు.

కొమురవెల్లి..జనసంద్రం

మల్లన్న ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

- భక్తుల కొంగు బంగారం మల్లికార్జునస్వామి
- నాలుగో ఆదివారానికి 40వేల మంది భక్తుల రాక

చేర్యాల, ఫిబ్రవరి 9 : భక్తుల పాలిట కొంగు బంగారంగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రం జనసంద్రంగా మారింది. నాలుగో ఆదివారం సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని పరవశించిపోయారు. స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు 40వేల మంది భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. స్వామి వారి సన్నిధిలో మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతో పాటు ప్రైవేట్‌గా ఉన్న గదులు అద్దెకు తీసుకుని బస చేశారు.ఆదివారం వేకువజామునే నిద్రలేచి కోనేటిలో పవిత్ర స్నానం ఆచరించి నేరుగాస్వామివారి దర్శనం కోసం క్యూలో గంటలపాటు వేచి ఉండి స్వామి వారిని దర్శించుకొన్నారు. కొంత మంది భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు, కేశఖండన, నజరు, మహామండపం, చిలుక పట్నం, బోనం, టెంకాయలు, హుండీలో కానుకలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మరి కొందరు భక్తులు కోరికలు నెరవేర్చాలని గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, సంతానం కలగాలని మరికొందరు ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టివేసి స్వామి వారిని వేడుకున్నారు.భక్తులకు మల్లన్న ఆలయ ఈవో కె.రామాంజనేయులు,పాలక మండలి సభ్యులు, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ నేతృత్వంలో చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కల్యాణకట్టలో వసూళ్ల దందా

కొమురవెల్లి మల్లికార్జునస్వామి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు కల్యాణకట్ట వద్దకు వెళ్తే క్షురకులు డబ్బులు ఇస్తేనే పుట్రు వెంట్రుకలు తీస్తామంటుండడంతో పలువురు భక్తులు ఈవో రామాంజనేయులుకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఈవో హుటాహుటిన కల్యాణకట్ట వద్దకు వెళ్లి భక్తుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తే ఆలయ నిబంధనల మేరకు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించేందుకు టికెట్లు కొనుగోలు చేస్తే సరిపోతుందని డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. భక్తులను ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే ఆలయ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనప్పటి నుంచి కొందరు క్షురకులు వసూళ్ల దందా కొనసాగిస్తున్నారని, వెంటనే వాటిని నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్లపై ఇబ్బందులు పడుతున్న భక్తులు

స్వామివారి క్షేత్రంలోని ప్రధాన వీధులతో పాటు లింకు రోడ్ల పై చిరు వ్యాపారులు వ్యాపారాన్ని కొనసాగిస్తుండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.బోనం ఎత్తుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న భక్తులు వారికి తాకుతుండడంతో ఎక్కడ బోనం కిందపడిపోతుందననే ఆందోళనలో వారు ఇబ్బందులు పడుతూ స్వామివారి ఆలయానికి వెళ్తున్నారు. ఆలయవర్గాలతో పాటు పోలీసులు స్పందించి ప్రధాన రోడ్డుతో పాటు లింకురోడ్ల పై మార్కింగ్ వేసి దానిని దాటి రాకుండా నిబంధనలు విధిస్తే అటు వ్యాపారులతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'మల్లన్న' రాగి డాలర్ల విక్రయం : ఆలయ ఈవో

కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారికి సంబంధించిన రాగి డాలర్లను భక్తులకు ఇక నుంచి స్వామి వారి క్షేత్రంలో విక్రయించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో కె.రామాంజనేయులు తెలిపారు.ఆదివారం ఆయన రాగి డాలర్లకు సంబంధించిన బ్రోచర్‌ను ఆలయంలో విడుదల చేశారు. అనంతరం ఈవో విలేకరులతో మాట్లాడుతూ 5 గ్రాముల బరువు ఉన్న రాగి డాలర్‌ను రూ.70, 2.5గ్రాముల బరువుగల స్వామివారి డాలర్‌ను రూ.40కి విక్రయించాలని నిర్ణయించినట్లు తెలిపారు.స్వామి వారి రూపంతో తయారు చేయించిన డాలర్లను భక్తులు కొనుగోలు చేయాలన్నారు. ఆలయ సిబ్బంది శంకర్‌శర్మ పాల్గొన్నారు.

రాగి డాలర్ల బ్రోచర్‌ను విడదల చేస్తున్న ఆలయ ఈవో రామాంజనేయులు

కొమురవెల్లి ఆలయ ప్రధాన వీధుల్లో భక్తులు

కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలి

సిద్దిపేటలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

- యాదవుల గౌరవాన్ని పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కింది
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలి
- గొర్రెల పంపిణీకి అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తా
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- సిద్దిపేటలో శ్రీకృష్ణయాదవ సంఘం ఫంక్షన్‌హాల్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ

సిద్దిపేట, ఫిబ్రవరి 9 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి మంత్రివర్గంలో 42 శాతం పదవులను బీసీలకు ఇవ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీకృష్ణయాదవ సంఘం ఫంక్షన్‌హాల్ కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులను ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవ సంఘం సభ్యులు ఫంక్షన్‌హాల్‌ను మంచిగా మెయింటెనెన్స్ చేస్తున్నారని, ఫంక్షన్ హాల్ వల్ల వచ్చే డబ్బులను పేద విద్యార్థులకు ఖర్చు చేయాలన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు యాదవుల గొప్పతనాన్ని అసెంబ్లీలో చెప్పి గౌరవాన్ని పెంచారన్నారు. అనేక మంది యాదవ నాయకులను ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, పార్లమెంట్ సభ్యులుగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క యాదవ నేతకు మంత్రి పదవి ఇవ్వకపోగా కనీస గుర్తింపు కూడా లేదన్నారు. గొల్లకుర్మల అభ్యున్నతికి గొర్రె పిల్లలను కేసీఆర్ పంపిణీ చేస్తే, రెండో విడత గొర్రె పిల్లలు ఇవ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వకుండా డీడీలు వాపస్ ఇస్తుందన్నారు. హైదరాబాద్‌లోని మంచి రేవులలో వంద కోట్ల విలువ చేసే భూమి ఇచ్చి యాదవ భవనాలు నిర్మించారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క కులానికి, వర్గానికి సహాయం అందించలేదన్నారు. కాంగ్రెస్‌ది ఎగవేతల ప్రభుత్వమన్నారు. బీసీ బంధు చెక్కులను సైతం నిలిపివేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అన్ని వర్గాల ఓట్లు కావాలి కానీ.. బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు చేరి 8 ఎంపీ స్థానాల్లో గెలిపిస్తే ఇచ్చింది గుండు సున్న.. తెచ్చింది గాడిద గుడ్డు అన్నారు. తెలంగాణకు నిధులు ఎన్ని ఇచ్చారని ప్రశ్నించారు. ఆంధ్రాకు నిధుల వరద పారించి తెలంగాణకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదన్నారు. రెండో విడత గొర్రె పిల్లలు ఇవ్వాలని అసెంబ్లీలో ప్రభుత్వంపై పోరాడుతామన్నారు. కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే తెలంగాణకు లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందన్నారు. తెలంగాణను దోచుకొని రేవంత్‌రెడ్డి ఢిల్లీకి కప్పం కడుతున్నారని ఆరోపించారు. ఉద్యమాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి ఆత్మగౌరవాన్ని కేసీఆర్ నిలబెడితే నేడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోసం 11 సార్లు ఢిల్లీకి వెళ్లినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ నేతలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలో తాకట్టు పెట్టారని విమర్శించారు. ముఖ్యమంత్రికి రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరకడం లేదని విలేకరులు ప్రశ్నిస్తే తనతో రాహుల్‌గాంధీ మాట్లాడారని ఫోన్ చూపించుకునే దౌర్భాగ్యం రేవంత్‌రెడ్డిది అన్నారు. నేడు రాష్ట్రంలో ఏ పని జరగాలన్నా, మంత్రివర్గ విస్తరణ చేయాలన్నా ఢిల్లీ అనుమతి తప్పనిసరైందన్నారు. నేడు ఏ పని జరగాలన్నా మంత్రులు 30 శాతం కమిషన్లు అడుగుతున్నారని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఆరోపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగం కుదేలై భూముల రేట్లు భారీగా పడిపోయాయన్నారు. కరోనా కష్టకాలంలోనూ డబ్బులు దొరికాయి కానీ కాంగ్రెస్ పాలనలో డబ్బులు దొరకడం లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య కమిషన్ల కోసం గొడవ జరుగుతుందన్నారు. బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలన్నారు. గతంలో ఏమారుమూల ప్రాంతానికి వెళ్లినా ఎకరం భూమి రూ.30 నుంచి రూ.50 లక్షలు ఉండేదని, నేడు ఆపదకు అమ్ముకుందామన్నా రూ.15 లక్షలకు కూడా అమ్ముడుపోవడం లేదన్నారు. జీవాలకు నీరు దొరకని పరిస్థితి నుంచి కేసీఆర్ హయాంలో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, యాదవసంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిండ్ల అయిలయ్య, ఫంక్షన్‌హాల్ అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్ చంద్రం, యాదవ సంఘం నాయకులు ఎల్లంయాదవ్, దాసరి శ్రీనివాస్, రమేశ్, బాలమల్లు, శ్రీనివాస్, గుండెల్లి వేణు, ఉండ్రాల రాజేశం పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే

మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్,ఫిబ్రవరి 9 : తెలంగాణ భవన్‌లో బీసీ ముఖ్య నేతల సమీక్షా సమావేశం అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారంమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సాపూర్ నియోజకవర్గంలోని పరిస్థితులను కేటీఆర్‌కు వివరించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి పలు సూచనలు చేశారు.వీరితో పాటు బీఆర్ఎస్ యువ నాయకుడు సంతోష్‌రెడ్డి ఉన్నారు.

డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలి

నల్లవల్లిలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

గుమ్మడిదలలో ఎన్‌హెచ్‌పై ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు, రైతులు, యువకులు

- నల్లవల్లిలో ప్రారంభమైన రిలే నిరాహారదీక్ష
- మద్దతు తెలిపిన గుమ్మడిదల జేఏసీ పోరాటసమితి
- గుమ్మడిదల మండలం వ్యాప్తంగా నిరసనలు
- రైతులు, జేఏసీ నాయకులు, యువత పెద్ద ఎత్తున ర్యాలీలు
- సంఘీభావం తెలిపిన మెడికల్ యూనియన్ సభ్యులు
- ఇంకా పోలీసుల నిర్బంధంలోనే గుమ్మడిదల మండలం

గుమ్మడిదల, ఫిబ్రవరి 9: డంపింగ్‌యార్డును ఉపసంహరించుకునేదాకా పోరాటం ఆగదని బాధిత గ్రామాల ప్రజలు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. పచ్చని పంటపొలాలను నాశనంచేసి భావితరాల జీవితాలను బుగ్గిపాలు చేయవద్దంటూ ఆందోళనకారులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఐదు రోజులుగా డంపింగ్‌యార్డు పనులు నిలిపివేయాలని, ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని, ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన పనులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో చేపడుతున్న డంపింగ్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని ఆదివారం బాధితగ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు, చిన్నారులు ఆందోళన బాటపట్టారు. డప్పుచప్పులతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి జై జవాన్.. జైకిసాన్, సేవ్ ప్యారానగర్, పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ నినాదాలు చేశారు. నల్లవల్లిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.

దీక్షకు మద్దతుగా ..నాయకుల సంఘీభావం

నర్సాపూర్ నుంచి ర్యాలీగా వచ్చిన మెడికల్ యూనియన్ సభ్యులు నల్లవల్లి దీక్షాశిబిరంలో ఉన్న ఆందోళనకారులకు సంఘీభావం తెలిపారు. గుమ్మడిదలలో నూతనంగా ఏర్పడిన డంపింగ్ యార్డు వ్యతిరేక జేఏసీ కమిటీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జవహర్‌నగర్ చెత్తను ప్యారానగర్ అటవీప్రాంతంలో వేసి పచ్చని అడవిని నాశనం చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు వల్ల రాయచెరువు కలుషితమవుతుందని, ప్రజలు అనారోగ్యంపాలవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిష్టానికి అనుగుణంగా డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

మండల వ్యాప్తంగా ర్యాలీలు, నిరసనలు

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో రైతు సంఘం నాయకులు, జేఏసీ నాయకులు, యువకులు పెద్ద ఎత్తున ఎన్‌హెచ్‌పై ర్యాలీలు నిర్వహించారు. బొంతపల్లి, దోమడుగు, మంభాపూర్, అనంతారం, కొత్తపల్లి, కానుకుంట గ్రామాల ప్రజలు ఆయా గ్రామాల్లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించి ఆందోళన చేపట్టారు. డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దోమడుగులో మంగయ్య, రాజశేఖర్, మంభాపూర్‌లో కంజర్ల శ్రీనివాస్, కొత్తపల్లిలో ప్రభాకర్‌రెడ్డి, సత్తయ్య, రామకృష్ణ, నల్లవల్లిలో ఫయాజ్‌షరీఫ్, కుమ్మరి ఆంజనేయులు, శేఖర్,రామప్ప, శ్రీనివాస్ భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

డంపింగ్‌యార్డు పనులను వెంటనే నిలిపివేయాలని మండల కేంద్రంలో జేఏసీ కమిటీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మగారి సదానందరెడ్డి, రైతులు పోచుగారి మోహన్‌రెడ్డి,మద్దుల బాల్‌రెడ్డి, జాతీయ రైతు సంఘం నాయకుడు మందబల రాంరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంయుక్తంగా ఎన్‌హెచ్‌పై ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.

పోలీసుల నిర్బంధంలోనే బాధిత గ్రామాలు

డంపింగ్‌యార్డును వ్యతిరేకిస్తున్న బాధిత గ్రామాల్లో పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నది. మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు టెంట్లు వేసుకుని ఆందోళనకారులను చెదరగొట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ఆందోళనలు చేస్తున్న నిరసనకారుల చుట్టూ పోలీసులు వలయంగా మారుతున్నారు. ఎలాంటి చెదురుమదురు ఘటనలు జరిగినా వెంటనే అదుపుచేయటానికి సిద్ధంగా ఉంటున్నారు.

కలిసికట్టుగా పోరాడుతాం

ప్యారానగర్ అటవీప్రాంతంలో చేట్టిన డంపింగ్‌యార్డును ప్రభుత్వం ఉపసంహరించేదాకా పోరాడుతామని జేఏసీ కమిటీ చైర్మన్ చిమ్ముల జైపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో అన్ని పార్టీల నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. డంపింగ్ యార్డు అనుమతులు రద్దు చేసే వరకు జేఏసీ ఉద్యమమే ఊపిరిగా పోరాడుతుందని తీర్మానం చేశారు. సోమవారం ఉదయం పోరాటాన్ని ఉధృతం చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుకు హెచ్చరించారు. సోమవారం నిర్వహించే ఆందోళనకు అందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉత్తరాలు రాయనున్న యువకులు

డంపింగ్‌యార్డు నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని, రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్‌యార్డును ఉపసంహరించుకోవాలని ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, గ్రీన్ ట్రిబ్యునల్‌కు మూడు వేల ఉత్తరాలు రాయనున్నట్లు బాధిత గ్రామాల ప్రజలు తెలిపారు. ఉత్తరాల రూపంలో నిరసన తెలుపుతామన్నారు.

పోరాటం ఉధృతం చేస్తాం:సీపీఎం

డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య తెలిపారు. వారం రోజుల నుంచి బాధిత గ్రామాల ప్రజలు ఆందోళనలు చేస్తుంటే కలెక్టర్, జిల్లా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. ప్రజాప్రభుత్వంలో పోరాటాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. పీసీబీ, అటవీ అధికారులు ఎక్కడ నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ చెక్‌పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.



డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నల్లవల్లి దీక్షాశిబిరంలో ఆందోళన చేస్తున్న బాధితగ్రామాల ప్రజలు

పోలీసుల నిర్బంధంలో సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల

ఆకట్టుకున్న పశువుల జాతర

పశువులను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

జహీరాబాద్, ఫిబ్రవరి 9 : సంవత్సరానికి ఒకసారి జరిగే పశువుల జాతర(సంత) కిక్కిరిసిపోయింది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ గ్రామ శివారులోని దర్గా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన ప్రత్యేక పశువుల జాతరకు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు పశువులను ప్రత్యేక వాహనాల్లో తీసుకువచ్చారు. పశువులను కొనుగోలు చేసేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన రైతులు తరలివచ్చారు. పశువుల సంతలో దియోనీ, ఒంగోలు, కిల్లరి తదితర జాతులకు చెందిన ఎడ్లు, కోడెదూడలు, ఆవులు, పాడి గేదెలు సుమారు రూ. 50 వేల నుంచి రూ. 3.50 లక్షల వరకు ధర పలికాయి. మానూర్ మండలం ఎటిగడ్డ ఎల్గోయికి చెందిన వెంకట్‌రావు రైతుకు చెందిన ఎడ్లకు రూ. 3లక్షలు ధర చెప్పాగా రాయికోడ్ నాగ్వర్‌కు చెందిన సమీర్ రూ. 2.50 లక్షలకు కొనుగోలు చేశాడు. అనంతరం దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్తమ పశుపోషకులైన రైతులకు స్థానిక గ్రామానికి చెందిన దివంగత అడివప్ప, గిరిజమ్మ జ్ఞాపకార్థం బహుమతులను జహీరాబాద్ ఎంపీ సురేశ్‌కుమార్, టీజీఐడీసీ రాష్ట్ర మాజీ చైర్మన్ హైమ్మద్ అందజేశారు. జహీరాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, డీసీసీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సిద్ధిలింగయ్య స్వామి, ఎంపీపీ వైస్ చైర్మన్ గౌసుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ శిల్పాకారుడు డా. హోతి బస్వరాజ్, జాతర నిర్వాహకులు యూనుస్‌ఖాన్, మక్సూద్, నర్సింహులు, వాహెబ్ పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ ఉర్సు ఉత్సవాల్లో జరిగిన సంతకు భారీగా వచ్చిన పశువులు